# గుత్తి నాగేశ్వర రావు
## భళే అదృష్టవంతుడు

బక్క పల్చగా షరాయీ ఓపెన్ షర్టూ వేసుకుని పౌరాణికం నాటకాలాడేవాళ్ళా జులపాలతో ఉండే నాగేశ్వర్రావు ఏమాత్రం బాగోడు. పోనీ, బుద్దేవన్నా మంచిదా అంటే అదీ కాదు. అలవాట్లేవన్నా మంచివా అంటే దీపాలెట్టేసరికి కుందయ్య సారాకొట్టు దగ్గరకెళ్ళి బాగా పుచ్చుకొచ్చి ఇక పేలడం మొదలెడతాడు.

రోజులాగే ఆవేళ కూడా బాగా తాగేసి ఇంటికొచ్చిన నాగేశ్వర్రావు రామసీతగదిలో కెళ్ళబోయి ఆదమరిచి నిద్రోతున్న రాణీ గదిలోకెళ్ళిపోయేడు. అది చూసిన రామసీత మంచం మీంచి లేచేలోపే దబ్బుమని పడిపోయింది రాణీ గది తలుపు.



లోపల ఆకివీడు నవ్వారు మంచం చప్పుళ్ళకి అదోలా నవ్వుకుంటున్న రామసీతకి ఎప్పటికో పట్టింది నిద్ర.

మర్నాడు కూడా మందేసుకొచ్చేక భోంచేసిన నాగేశ్వర్రావు నిన్నట్లాగే రాణీ గదిలోకి వెళ్ళబోయి రామసీత గదిలో కొచ్చేసేడు.

తన గదిలో పడుకున్న రాణీ ఎదురుగుండా ఉన్న గదిలోంచి నులకమంచం చప్పుళ్ళు వింటూ వెల్లకిలా పడుకున్న రాణికి ఎప్పుడో పట్టింది కునుకు.

* * *

గుత్తి నాగేశ్వర్రావు ఇల్లు దేవాంగులపేటలో బళ్ళనాగమల్లన్నగారింటికవలతలుంది. వాళ్ళమ్మ చిన వీరమ్మకి సంతానం ఇద్దరే. తనూ వాళ్ళ చెల్లి సావిత్రి. రాజోలు అవతలున్న మోరి ఇచ్చేరు సావిత్రిని. నాగేశ్వర్రావుకూడా ఆవూరి సంబంధమే చేసుకున్నాడు. పేరు అనంత. మాంచి అందగత్తె. భలేగా చేస్తది వంటలు. మగ్గం ముందు కూర్చుందంటే మగోడెందుకూ పనికిరాడు అంత బాగుంటది నేత. రోజుకోచీర పూర్తి చేసే అనంతకి దణ్ణెం మిషను వేలాడదీసి బుటా చీరలు నేయడం చాలా ఇష్టం.

రామచంద్రపురం సూర్నాణడాక్టరుగారి హాస్పిటల్లో కానుపు కనాకష్టమయిన అనంత ఆడపిల్లని కని కాలం చేసింది.

"మళ్ళీ పెళ్ళి చేసుకొ"మ్మని తల్లి అంటే "పిల్లని జూడు" అన్నాడు.

రంగంలోకి దిగిన చినవీరమ్మ వాళ్ళ కులపోళ్ళుండే ఊళ్ళమీద పడింది. కొంకుదురు సావరం, ద్రాక్షారామం, అద్దంపల్లి, ఇంజరం అలా రకరకాల ఊళ్ళల్లో తిరుగుతుంటే ఆదివారప్పేటలో ఓ సంబంధం ఉందని నూలు వీర్రాజుగారి ద్వారా తెల్సింది.

ఆశీజమాసం, ఏకాదశి ఆవేళ, రాహుకాలాలూ, యమగండాలూ పొద్దుట పది దాటిందాకానే ఆ తర్వాతన్నీ శుభఘడియలే.

ఆదివారపుపేటలో బాలయోగిగారి ఆశ్రమానికి



ఆరిళ్ళ అవతలి దొంతంశెట్టి బద్ధ్రావుగారింటి ముందాగింది జట్కాబండి.

దాంట్లోంచి దిగిన చినవీరమ్మనీ, నాగేశ్వర్రావునీ మర్యాదగా లోపలికి తీసుకెళ్ళేరు బద్ధ్రావు బామ్మర్దులు.

మర్యాదలన్నీ అయ్యేకా పిల్లని తీసుకొచ్చేరు. చూసిన నాగేశ్వర్రావు భళేగా ఉందనుకున్నాడు. నాగేశ్వర్రావుని చూసిన ఆ పిల్లకూడా అదే అనుకుంది.

''పాప పేరేంటండీ?'' అడిగింది చినవీరమ్మ.

నవ్వేసుకున్న బద్ధ్రావు భార్య వీరమణి ''దానికో కతుంది లేండి... అదేంటంటేనండీ..మేవంతా మా బాలయోగిగార్ని నమ్ముకున్నోళ్ళమేనండి. అప్పుడప్పుడూ బాలయోగిగారు బెంగుళూరెళ్ళి ఆ ఏరియావాళ్ళకి నెలల తరబడి దర్శనాలిస్తుంటారండి. ముఖ్యంగా బెంగుళూరు రాణీగారికండి...అయితేనండి మాపాప పుట్టినప్పుడు పేరు బాలయోగిగారితో పెట్టిద్దారని చూస్తే బెంగులూరెళ్ళిన ఆరు మూడ్నెల్లదాకా రాలేదండి. ఈలోగా అంతా బెంగుళూరు రాణీ..బెంగుళూరు రాణీ అని పిలవడం మొదలెట్టేసేరండి మా పాపని. మేం మట్టుకి ఆ బెంగుళూరు తీసేసి రాణీ ఉంచుకున్నావండి...'' అంది.

''అయితే పాపకి ఆ బాలయోగిగారు పెట్టిన పేరేంటి?'' అడిగింది చినవీరమ్మ.

''ఉమాగౌరీ... అయితేనండి అప్పటికే రాణి అని పిలవడం అలవాటైపోడం వల్ల ఆరు పెట్టిన పేరు మూలపడి పోయిందండీ'' అన్నాడు బద్ధ్రావు.

అలా అదీ ఇదీ మాటాడుకోడంలో కాసేపట్లోనే ఆ రెండు కుటుంబాలూ వరసలు పెట్టి పిలిచేసుకోడం మొదలెట్టేసినియ్యి... ఇంకాస్సేపయ్యాక ''ముహుర్తాలు ఎప్పుడు పెట్టుకుందారి అంటే ఎప్పుడు పెట్టుకుందారి'' అనేసుకున్నారు.

అలా మాటాడేసుకుని బాగా దగ్గరయిపోతుండగా నాగేశ్వర్రావుకి ముందో పెళ్ళయిందన్న సీక్రేటు బయటపడింది.

దాంతో దొంతంశెట్టి బద్ధ్రావు బామ్మరుదులుకీ ఆ ముక్క దాచిపెట్టిన చినవీరమ్మకి పడింది. ఒకటే గొడవ. వీధి వీధంతా పోగయ్యేరు. దగ్గర దగ్గర కొట్టినంత పని జేసి చినవీరమ్మని నాగేశ్వర్రావునీ ఆదివారపుపేట పొలిమేర దాకా తరిమేసేరు. మొదటిపెళ్ళి రహస్యం దాచిన తల్లిని బూతులు తిట్టేసిన నాగేశ్వర్రావు, ఇంటికెళ్ళేకా జరిగిందంతా చెల్లెలు సావిత్రికి ఉత్తరం రాసేడు.

మూడోనాడు మధ్యాన్నం పెనిమిటితో పాటు దిగిపోయిన సావిత్రి చినవీరమ్మనీ నాగేశ్వర్రావునీ మోరి తీసుకుపోయింది.

ఊటుకూరి జగన్నాధంగారమ్మాయి రామసీతని చూసేడు నాగేశ్వర్రావు. రంగూ అదీ పర్లేదుగానీ ఒళ్ళు లేక నక్కలాగుంది. కారప్పూసా, మైసూరుపాకం ముక్కా పళ్ళేల్లో పెట్టి ''పుచ్చుకోండి'' అంటున్నప్పుడే ''ఏవండీ నాకింతకుముందే పెళ్ళయ్యింది ఈ వూరి సంబంధమే జేసుకున్నాను. ఆ మనిషి పోడంతో మారుమనువుకోసం వచ్చేను'' అని చెప్పేసేడు నాగేశ్వర్రావు.

''ఆ సంగతి మాకు తెల్సులేండి అల్లుడుగారూ!'' అని నవ్వేసేడు పెళ్ళికూతురు తండ్రి జగన్నాధం.

అంతర్వేది నరసింహస్వామి గుళ్ళో రామసీతతో పెళ్ళయ్యింది నాగేశ్వర్రావుకి. కాపరానికొచ్చిన రామసీత నాగేశ్వర్రావునీ అతని మొదటిభార్య అనంత కూతురు సుమతిని ప్రాణంలా చూసుకుంటుంది. ఇక పగలంతా రాట్నం ముందు కూర్చుని కండెలూ, శిల్పలూ చుడ్తుంది. మగ్గం గోతిలోంచి బయటికొచ్చే నాగేశ్వర్రావు పొద్దోయేకా నల్లమిల్లి రాజారెడ్డి గారింటివతలున్న సారాకొట్లో తాగొచ్చి అందరిముందూ తనని తిడుతున్నప్పుడూ, నిద్దట్లో పెద్ద గురకెడుతున్నప్పుడూ నవ్వుతా భరిస్తుంది రామసీత.

రోజులు గడుస్తుండగా చినవీరమ్మ కాలం చేసింది.

రామసీతకి కడుపొచ్చింది.

ఆరోజు చల్దిపొద్దు ఇంకా దాటలేదు. ఆ చివరనించి ఈ చివరదాకా కట్టిన పడుగు మీద గెంజి జల్లే జనం, మనిషంత పొడుగున్న బ్రెష్షులాగే జనంతో నిండిపోయి వుంది వీధి. తెల్లవారు ఝామున పోయిన అల్లరివిశ్వనాథం శవాన్ని అనంతసేనలో (వెదురు బద్దల్తో గుడిలా కట్టి గుడ్డ చుట్టి పైన చెంబు బోర్లించి లోపల శవాన్ని కూర్చోబెడతారు) తీసుకెళుతున్నారు శ్మశానానికి. అంతలో ఆనాడు ఆదివారపు పేటనించి దొంతంశెట్టి బద్ధ్రావు కుటుంబీకులు రెండు జట్కాబళ్ళల్లో దిగిపోయేరు.

నాగేశ్వర్రావు చేతులట్టేసుకున్న బద్ధ్రావు ''బాబూ... ఇప్పటికి ఏడు సంబంధాలు తీసుకొచ్చేం మారాణీకి. ఏది ఒద్దంటుంది. గన్నేరు పప్పు తిని మూడుసార్లు ప్రేణాలు తీసుకోబోయింది. ఎందుకే మమ్మల్నిలాగ ఏడిపిస్తున్నావ్ నీకేం కావాలని అళ్ళమ్మ అడిగితే ఆ పసలపూడి నించొచ్చిన గుత్తినాగేశ్వర్రావుని తప్ప ఈ ప్రెపంచకంలో ఎవర్ని చేసుకోనంటుంది'' అన్నాడు.

''మీరు పొమ్మని తోలేసేకా మోరిసంబంధం చేసేసుకున్నానండీ'' ఓ పక్క కడుపుతో ఉండికూడా మొదటిభార్య కూతుర్ని ఆడిస్తున్న రామసీతని చూపించేడు నాగేశ్వర్రావు.

రామసీత కాళ్ళు పట్టేసుకున్న వాళ్ళంతా ''మా బిడ్డని నువ్వే కాపాడాలమ్మా'' అని ఏడ్డం మొదలెట్టారు.

వెన్నపూసలాగ కరిగిపోయిన రామసీత ''మీ రాణీ నాతోబుట్టువుతో సమానం అలాగే కానియ్యండి'' అంది.

బ్రహ్మముహూర్తంలో ద్రాక్షారామం భీమేశ్వరుడి గుళ్ళో రామసీత ఆధ్వర్యంలో రాణీకి నాగేశ్వర్రావుకీ పెళ్ళయిపోయింది.

రామసీతకి సుఖప్రసవం అయ్యింది.

కాపురానికొచ్చిన రాణి పాపకి ''శివపార్వతి అని పెడదాం పేరు. ఎలాగుందక్కా?''అంది.

''బ్రెహ్మాండంగా ఉంది చెల్లీ'' అంది రామసీత.

వీధి అరుగుమీద కూర్చుని ఎవరితోనో గొడవ పడ్తున్న నాగేశ్వర్రావు దగ్గరకెళ్ళి అడిగితే ''ఎలాగోలాగ పడండెహె'' అన్నాడు.

ఇంట్లో వంట చెయ్యడం, సంత చెయ్యడం సుమతిని చూసుకోడం లాంటిపన్లు రాణి చేస్తుంది. భర్తకి ఎదురుగా వున్న మగ్గం నెయ్యడం, కండిలు చుట్టడం, పొద్దుట వీధిలో పరిగెడ్తుంటే గెంజి పట్టుకెళ్ళడం. అబ్బులు మరాసు దగ్గరకెళ్ళడం సొసైటీ నించి నూలు తేవడం, చీరలిచ్చేక వాళ్ళిచ్చిన డబ్బులు దాయడం లాంటి పన్లు రామసీత చూసుకుంటుంది. ఇంటి పన్లు అలా పంచుకున్న ఆ ఆడాళ్ళిద్దరూ గుత్తినాగేశ్వర్రావుని కూడా ఒక్కోరాత్రి ఒక్కొక్కళ్ళు పంచుకుంటున్నారు.

ఒకరోజు బాగా తాగొచ్చిన నాగేశ్వర్రావు రాణి వండిన వంకాయకూర నోట్లో పెట్టుకుని ''ఛూ'' అని ఊసేసి పచ్చి బూతులు తిడ్తుంటే ఆ సందులో కాపరాలుండే వాళ్ళంతా లేచిపోయి ''ఎదవనాకొడుక్కి తాగుడెక్కువయ్యిందీ వేళ'' అని తిట్టుకుంటున్నారు.

గబగబా వచ్చి కూర రుచి చూసింది రామసీత. నిజమే సరిగా ఉడకని వంకాయలు కందబారిపోడంతో చేదొచ్చేసింది కూర. అది బయటి పెట్టకండా నాగేశ్వర్రావు పక్కకి తిరిగి మీకు ''తాగుడు మరీ ఎక్కువైపోయి ఏదేదో అంటున్నారు... ఇంచక్కా ఉన్న ఈకూర తుపుక్కున ఊసేస్తారా'' అని అతను ఊపిరాడకండా మాటాడేస్తుంటే నిజమేనేమో తాగిన మత్తులో నాకలా అనిపించిందేమో అనుకుని ఆ మర్నాటినుంచి రాణీ ఏం వండితే అది తినడం మొదలెట్టాడు.

ఆడోళ్ళిద్దరూ బిక్కవోలు సుబ్బారాయుడి షష్టికి బయల్దేరారు.

దారిలో ఎలా పోయిందో ఏంటో రామసీత మొల్లో దోపుకున్న డబ్బుల సంచిపోయింది.

ఆ నెల ఖర్చుకి సంబంధించిన డబ్బంతా ఆ సంచిలో వుంది. రాణికికూడా చెప్పకండా తనలో తానే బాధపడిపోవడం మొదలెట్టింది రామసీత. పాలుపోసే పులగం చంటిరెడ్డికి నెలదాటి పదిరోజులైనా డబ్బులివ్వక పోయేసరికి కొంచెం విసుక్కుంటా మాటాడేడు ఆవేళ. అది విన్న నాగేశ్వర్రావు ''ఎందుకివ్వలేదు?'' అనడిగేడు రామసీతని.

డబ్బులుపోయిన సంగతి చెప్పలేక కంగారుపడ్తుంది రామసీత. గోలెం దగ్గర గిన్నెలు కడుగుతున్న రాణీ గబగబా వాళ్ళ మధ్యలోకి వచ్చేసి ''కొంచెం అవసరం అని మావాళ్ళు ఆదివారపుపేట నించి కబురెడితే పంపించేను ఇది అక్కకి కూడా తెలీదు. మంగళారం సంతనాటికి తెచ్చేస్తార్లేండి'' అని నింద తన మీదేసుకుని, నాగేశ్వర్రావు తిట్టిన తిట్లేవో తనుపడి ఇక రామసీత మీద పిసరంత మాటపడకండా సర్దేసింది రాణి.

* * *

రాణికి మగకుర్రోడు పుడితే బాలయోగి అని పెట్టేరు పేరు.

తమ పిల్లలకంటే మొదటావిడ కూతురు సుమతినే ప్రాణంలా చూసుకుంటున్నారు వాళ్ళిద్దరూ.

పెద్దదైన సుమతీ రామచంద్రపురం కాలేజీలో చదూతుంది. అయితే, ఆ పిల్లకి అన్నీ తండ్రి బుద్ధులే వచ్చినియ్యి. తండ్రిలాగే ఎక్కడేం మాటాడాలో తెలీదు. ఎక్కడపడితే అక్కడ ఎవళ్ళని పడితే వాళ్ళని నోటికి ఏదొస్తే అది అనేసెయ్యడం, తర్వాత గొడవలు పడిపోడం లాంటివి చేస్తుంది. సుమతి వరసావాపీ చూస్తున్న రామసీత, రాణీ ఈ పిల్లకి ఎలాంటి మొగుడొస్తాడో ఏంటో అని బెంగెట్టేసుకుంటుండగా కొడ్లవాళ్ళ మందులషాపులో పనిచేస్తున్న శేషగిరి అనే కుర్రోడ్ని సుమతి ఇష్టపడుతుంది అని తెల్సింది. దొంగచాటుగా వెళ్ళి చూసేరు ఆకుర్రోడ్ని.

చాలా నిదానం, చాలా ఒబ్బిడైన మనిషి శేషగిరి. ఏ దురలవాట్లూ లేవు. సుమతి ఎంత ఎక్కువగా వాగుతుందో ఆ కుర్రోడు అంత తక్కువ మాటాడ్తున్నాడు. పోన్లే ఆ దేవుడు సుమతిని కరుణించేడు అనుకున్నారు.

ఒకరోజు పసలపూడి ఊళ్ళోకొచ్చి గుత్తినాగేశ్వర్రావుని కలిసి అంతా చెప్పిన శేషగిరి ''మీ అవమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నానండీ?'' అన్నాడు.

పళ్ళగా నవ్వేసిన నాగేశ్వర్రావు ''మా పిల్ల డిగ్రీ చేస్తుంది నువ్వేం చేసావ్?'' అనడిగేడు.

''పేడ చేసేను... టెన్త్ తప్పేనండి'' అన్నాడు శేషగిరి.

''నా మొదటిభార్య బంగారం వుంది మా పిల్లకి. మీ ఇంట్లో ఏ మాత్రముందేటి?'' అడిగేడు నాగేశ్వర్రావు.

''పిసరంత కూడా లేదండి'' నవ్వుతానే అన్నాడు శేషగిరి.

''నా కూతురు చాలా అందగత్తె. నువ్వు అందగాడివా?'' అన్నాడు.

''కనపడ్డం లేదా నా చెత్తమొకం'' అన్నాడు శేషగిరి.

''ఏవీలేని ఎదవనాకొడకా నీకు నాకూతురు కావాల్సొచ్చిందిరా'' అనేసి మగ్గం దగ్గరున్న వాకబద్ద తీసుకుని చావబాదడం మొదలెట్టేడు

శేషగిరిని. అడ్డొచ్చిన సుమతికీ నాలుగు పడ్డాయి.

శేషగిరి వెళ్ళిపోయాక తెగ ఏడ్చిన సుమతి ఆ రాత్రీ మర్నాడూ ఏడుస్తూనే ఉంది. ఎంత బతిమాలినా అన్నం ముట్టుకోలేదు.

ఆకివీడులో ఉన్న మేనమావ పోయేడని కబురొస్తే ఆదరాబాదరా బయల్దేరాడు నాగేశ్వర్రావు.

ఇదే అదును జూసుకుని, సుమతిని వాళ్ళతో పాటు, తీసుకెళ్ళిన ఆ ఇద్దరు ఆడోళ్ళు శేషగిరిని కల్సి అతనితో మాటాడి చిన్నకారు కట్టించుకుని అన్నవరం తీసుకెళ్ళి గుళ్ళో వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసి, ఎర్రముఖమల్ సంచిలో వున్న నాగేశ్వర్రావు మొదటిభార్య అనంత నగల్నీ, సుమతినీ శేషగిరి కప్పగించి ఈ గొడవ సద్దుమనిగే దాకా ఎక్కడైనా తిరిగిరండని ఖర్చులకి ఇద్దరూ దాచుకున్నవి అణాపైసల్తో సహా ఇచ్చి పంపించేసేరు.

నాలుగురోజుల తర్వాత ఇంటికొచ్చిన గుత్తినాగేశ్వర్రావుకి ఇంటి వాతావరణంలో తేడా కనిపించింది. ఇద్దరు భార్యలూ మాటాడ్డం లేదు. సుమతి కనపడ్డం లేదు. ఆఖరికి చిన్నపిల్లలు కూడా ఏ చప్పుడూ చెయ్యకుండా ఆడుకుంటున్నారు. కాసేపయ్యాకా ''ఎందుకలాగున్నారు... సుమతేది? ..రాంపురం కాలేజీకెళ్ళిందా?'' అనడిగితే ''లేదు...'' అంది రాణి.

''మరెక్కడికెళ్ళింది?''

''మొన్న ఇంటికొచ్చిన ఆ శేషగిరి మమ్మల్నిద్దర్నీ తాళ్ళతో కట్టేసి, కండిల్ని మానోళ్ళలో కుక్కేసి, నూలు శిల్పల్ని మీదికి ఇసిరేసి, ట్రంకుపెట్లో ఉన్న అక్కయ్య నగల్నీ, సుమతినీ తీసుకుని మాకోసం వెతక్కండి మెడ్రాసు వెళ్తన్నాం అని చెప్పి మరీ పారిపోయేడు'' అంది రామసీత.

ఒక పెద్ద బ్రాందీకాయ పట్టుకొచ్చి నాగేశ్వర్రావు ముందు నిలబడ్డ రాణి వెళ్తా..వెళ్తా వెనక్కొచ్చిన శేషగిరి ''ఇది మీ కిమ్మని చెప్పి మరీ వెళ్ళేడు'' అనిచ్చింది.

రాత్రయ్యేకా ఆ సీసాలో ఉన్న సీమ సరుకు చెప్పరిస్తా ఇద్దరు పెళ్ళాల్నీ రమ్మని కేకేసిన నాగేశ్వర్రావు ''మీ ఇద్దర్నీ ధైర్యంగా తాళ్ళతో కట్టి పారేసి నాకూతుర్ని లాక్కెళ్ళిపోయేడు గదా ఆ శేషగిరి?'' అనడిగేడు.

''అవును'' అంది రామసీత.

''ఆ టైములో ఇక్కడుండుంటే నన్ను అదే చేసునుగదా?''

''అంతే గదా?'' అంది రాణి.

''ఇంత ధైర్యంగా పిల్లని లాక్కుపోయిన ఆడు గేరంటీగా దాన్ని పోషించగలడు... ఏవంటారు?'' అన్నాడు.

''అవునవును'' అన్నారిద్దరూ.

''శభాష్.. మగోడంటే ఆడేనే... ధైర్యవయిన మగోడు... నికార్సయిన మగోడు... వరసావాసీ తెలీని నా తింగరికూతురికి ఆ కుర్రోడు మొగుడుగా దొరకడం దాని అదృష్టం'' ఏదేదో మాటాడ్తా ఆ సీసాలో ఉన్నది మొత్తం తాగేసేడు ఈ ప్రపంచం మొత్తం మీద అదృష్టవంతుడైన గుత్తినాగేశ్వర్రావు.

* * *